క్లుప్తంగా

నేడు రథయాత్ర

జియ్యమ్మవలస: మండలంలోని చినమేరంగి గ్రామంలో రథయాత్ర ఉత్సవాలు శుక్రవారం ప్రారంభం కానున్నట్లు ఆలయ అర్చకుడు గిరిధర పాత్రో గురువారం తెలిపారు. తొమ్మిది రోజుల పాటు అంగరంగ వైభవంగా వేడుకలు నిర్వహించనున్నామని, భక్తులకు దైవదర్శనానికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు.

ఏరియా ఆస్పత్రిలో మరో వార్డు



ఏరియా ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన అదనపు బెడ్లు

సీతంపేట: స్థానిక ఏరియా ఆస్పత్రిలో రోగుల సౌకర్యార్థం మరో అదనపు కొత్త వార్డును గురువారం ఏర్పాటు చేశారు. అడపాదడపా వర్షాలు కురుస్తుండడంతో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున, బెడ్లు సరిపోక పోవడంతో అదనపు వార్డు ఏర్పాటు చేసినట్లు ఆస్పత్రి సూపరింటిండెంట్ శ్రీనివాసరావు తెలిపారు.

కొలతల ప్రకారం నిర్మాణాలు



నేరడి-బిలో నీటి కుండి, ఇంకుడు గుంత కొలతలు తీస్తున్న ఉపాధి సిబ్బంది


భామిని: ఉపాధి హామీ పథకంలో చేపడుతున్న ఇంకుడు గుంతలు, వాటర్ కుండీలు, గత్తం గొయ్యిలు కొలతల ప్రకారం నిర్మించాలని ఏపీఓ రేగిడి బాబూరావు, టీఏలు తేజా, శ్రీనివాస్ సూచించారు. మండలంలోని నేరడి -బి, బత్తిలి, గురండి, లోహరిజోల, మణిగ, బొడ్డగూడలలో చేపట్టిన ఉపాధి పనులను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందికి, వేతనదారులకు పలు సూచనలు చేశారు.

బాధ్యతల స్వీకరణ



సబ్ కలెక్టర్‌ను మర్యాద పూర్వకంగా కలసిన తహసీల్దార్ రాధాకృష్ణమూర్తి

పాలకొండ: మండల తహసీల్దార్‌గా రాధాకృష్ణమూర్తి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతవరకు ఇక్కడ పనిచేసిన బాలమురళీకృష్ణకు బలిజిపేట బదిలీ కాగా.. ఆయన స్థానంలో పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సి సెక్షన్ సూపరింటిండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న రాధాకృష్ణమూర్తి వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం రాధాకృష్ణమూర్తి సబ్ కలెక్టర్ యశ్వంత్‌కుమార్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు.



బాధ్యతలు స్వీకరించిన స్రవంతి

గరుగుబిల్లి: మండలంలోని నాగూరు గ్రామ పశువైద్యాధికారిగా అలజంగి స్రవంతి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు సిబ్బంది ఆమెకు స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు. మూగజీవాలు వ్యాధుల బారినపడకుండా చూస్తానని, పశువైద్య కేంద్రం సేవలను పాడిరైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

ట్యాబ్‌ల పంపిణీ



ట్యాబ్‌లు అందజేస్తున్న చేస్తున్న చైర్‌పర్సన్ కుమారి

పాలకొండ: నగర పంచాయతీలోని మెప్మా విభాగంలో విధులు నిర్వహిస్తున్న ఆర్పీలకు గురువారం ట్యాబ్‌లు పంపిణీ చేశారు. నగర పంచాయతీ అభివృద్ధి కమిటీ చైర్మన్ పల్లా కొండలరావు, చైర్స్‌పర్సన్ ఆకుల కుమారి, గంటా సంతోష్‌ల చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో మెప్మా సిబ్బంది, నగర పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

బాలేరులో జంగిల్ క్లియరెన్స్



బాలేరులో కొనసాగుతున్న పారిశుధ్య పనులు

భామిని: మండలంలోని బాలేరు వంశధార నదీ తీరానికి వెళ్లే రోడ్డు వెంబడి గురువారం జంగిల్ క్లియరెన్స్ చేపట్టారు. వర్షాలు పడుతున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పరిసరాలను పరిశుభ్రం చేస్తున్నట్లు సర్పంచ్ జామి ప్రభాకర్, ఎంపీటీసీ సభ్యుడు కె. చంద్రశేఖర్ తెలిపారు. ప్రతి ఒక్కరూ ఇంటి పరిసరాలను కూడా పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

వస్తున్నాయ్.. వస్తున్నాయ్.. జగన్నాథ రథ చక్రాలు..

- నేటి నుంచి వచ్చే నెల ఏడు వరకు రథోత్సవాలు
- దశావతారాల్లో భక్తులకు దర్శనమివ్వనున్న స్వామి



శతాబ్దాల చరిత్రగల పాలకొండ జగన్నాథస్వామి ఆలయం (ఇన్‌సెట్లో) స్వామివారు



పాలకొండ/పాలకొండ రూరల్: పాలకొండ పట్టణంలోని అత్యంత పురాతన ఆలయమైన జగన్నాథ స్వామి ఆలయంలో రథయాత్ర ఉత్సవాలు శుక్రవారం నుంచి ప్రారంభంకానున్నాయి. ఇందుకోసం దేవదాయ శాఖాధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఒడిశాలోని పూరీ ఆలయం తర్వాత అంతటి ప్రత్యేకత ఉన్న ఆలయం రాష్ట్రంలో ఇక్కడే ఉంది. 600 ఏళ్లనాటి చరిత్ర కలిగిన ఈ ఆలయంలో ప్రతి ఏటా జగన్నాథస్వామికి తొమ్మిది రోజుల పాటు రథయాత్ర నిర్వహించడం ఆనవాయితీ లక్షల సంఖ్యలో భక్తులు వచ్చి స్వామిని దర్శించుకుంటారు. జూలై 1న హిరాపంచమి కాగా, 5న స్వామివారి నిజరూప దర్శనం కల్పించేందు అధికారులు ఏర్పాట్లు చేపట్టారు. 10 రోజుల పాటు జరగనున్న ఈ ఉత్సవాల్లో ఒక్కో రోజు ఒక్కో అవతారంలో స్వామివారు భక్తులకు దర్శనమివ్వనున్నారు. ఆఖరి రోజు జూలై 7వ తేదీ సోమవారం స్వామి ప్రధాన ఆలయంలోకి తిరిగి ప్రవేశించడంతో ఈ యాత్ర ముగియనుందని అర్చకుడు మఠం విశ్వానాథ దాసు తెలిపారు. యాత్రలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుసుకోకుండా గట్టి బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్సై కె.ప్రయోగమూర్తి తెలిపారు.

సుదీర్ఘ చరిత్రకు సాక్షం...

పట్టణంలో వెలిసిన జగన్నాథస్వామి ఆలయాన్ని దేవదాయశాఖలో 1950లో విలీనం చేశారు. జేష్ట్య పౌర్ణమి నాడు నేత్రాభిషేకాన్ని జరిపి స్వామివారిని చీకటి గదిలో ఉంచుతారు. ఆ చీకటి గదిలో మహంతులు, పూజారులు స్వామివారి నేత్రాలను తుడుస్తారు. ఈ సమయంలో రైతులు స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి పొలం పనులకు శ్రీకారం చుడతారు. ఒడిశాలో గల పూరీ దేవస్థానం మాదిరి పట్టణానికి ఈశాన్యం వైపుగా స్థానిక ఆలయం రూపుదిద్దుకుంది. ఆలయ గోపురంపైగల సుదర్శన చక్రానికి నిత్యం పూజలు చేపట్టడం ఇక్కడి విశేషం.

ఒడిశా మాదిరి..

ఒడిశాలోని పూరిలో జరిగిన రథయాత్ర మాదిరిగానే ఇక్కడ కూడా సంప్రదాయబద్ధంగా స్వామి రథయాత్ర సాగుతుంది. ప్రధాన ఆలయం నుంచి పిన్నమ్మదేవి గుడి పక్కనుంచి గుడిచిన గుళ్ల (గుడించా మందిరం)వరకు భక్తుల ఆనందోత్సాహాల నడుమ రథోత్సవం జరుగుతుంది. జగన్నాథుడు, సుభద్ర, బలరామస్వామి ఆశీనులైన ఏకైక రథాన్ని ప్రజలు భక్తి పారవశ్యంతో లాగుతారు. ఆ సమయంలో రథంపై ఉన్న ముగ్గురు మూర్తులను సందర్శిస్తే పునర్జన్మ ఉండదని భక్తుల నమ్మకం. ఈక్రమంలో భక్తులు పోటీ పడుతూ రథంపై ఉన్న స్వామిని దర్శించేందుకు ఉత్సుకత చూపుతారు. రథం అక్కడక్కడ ఆగినప్పుడు ప్రధాన అర్చకులు రథంపై నుంచి భక్తులను ఉత్సాహవంతులను చేయడానికి నవరస రాజ శృంగార సూక్తులను తెలుగులో వినిపించడం ప్రతీతి.

అవతారాలు ఇలా...

ఈ నెల 27వ తేదీ శుక్రవారం తొలి దశమి.. 28న ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు చేపడతారు. 29న మత్స్యవతారం.. 30న కూర్మవతారం.. 1నవరహా నరసింహ అవతారం (హిరా పంచమి).. 2న వామన, పరుశురామావతారం.. 3న రామ, బలరామ అవతారం.. 4న కల్కి, జగన్మోహిని అవతారం.. 5న మారు దశమి(స్వామి వారి నిజరూప దర్శనం).. 6న తిరుగుయాత్ర (మారు యాత్ర).. 7వ తేదీ స్వామివారు ప్రధాన దేవాలయంలో ప్రవేశం.

పూర్తయిన ఏర్పాట్లు..



స్వామి వారి యాత్రకు ముస్తాబైన రథం

వీరఘట్టం: మండల కేంద్రంలోని జగన్నాథస్వామి ఆలయంలో రథోత్సవానికి సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. శుక్రవారం నుంచి జూలై 5 వరకు ఉత్సవాలు నిర్వహిస్తామని దేవదాయశాఖ ఈఓ సూర్యనారాయణ, అర్చకుడు లింగరాజురథో తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకోవాలని కోరారు.

లోక కల్యాణార్థమే..

సాక్షాత్తూ విష్ణుమూర్తి ద్వాపర యుగంలో కృష్ణావతారం తర్వాత భూలోకంలో జగన్నాథుడిగా అవతరించారు. అది మొదలుకుని ప్రతి ఏటా ఆషాఢ శుద్ధ విదియ నాడు జగన్నాథ రథయాత్ర జరపడం ఆనవాయితీ. లోక కల్యాణార్థమే స్వామి వారు జగన్నాథుడిగా అవతరించినట్లు పురాణాలు చెబుతున్నాయి.

– ఎస్‌వీఎల్ ఎస్ శర్మయాజీ, ప్రముఖ యజ్ఞకర్త, వీరఘట్టం

ఏర్పాట్లు పూర్తి చేశాం

జగన్నాథస్వామి రథయాత్ర ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. భక్తుల సంఖ్యను దృష్టిలో ఉంచుకుని ఎటువంటి అసౌకర్యం లేకండా ఉండేందుకు చర్యలు తీసుకున్నాం. పోలీసు బందోబస్తుతో పాటు కమిటీ సభ్యుల సహకారం తీసుకుంటున్నాం.

– సర్వేశ్వరరావు, దేవదాయశాఖ ఈఓ



జగన్నాథుని ఉత్సవ రథం(ఫైల్)

బడిఈడు పిల్లలను పాఠశాలలకు పంపించాలి

సీతంపేట: బడిఈడు పిల్లలందరినీ పాఠశాలకు పంపించాలని ఐటీడీఏ పీఓ సి.యశ్వంత్‌కుమార్ రెడ్డి అన్నారు. మండలంలోని దారిమల్లి గ్రామంలో ఉన్న పాఠశాలను గురువారం సందర్శించి, విద్యార్థుల ప్రవేశాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ, సచివాలయ సిబ్బందితో మాట్లాడారు. ఐదేళ్లు నిండిన చిన్నారులు పాఠశాలకు వచ్చేలా చర్యలు చేపట్టాలన్నారు. ఆయన వెంట ట్రైబల్ వెల్ఫేర్ డీడీ అన్నదొర, డిప్యూటీఈఓ రామ్మోహనరావు, ఏఎంఓ కోటిబాబు, సీఎంఓ చిరంజీవి, జీసీడీఓ రాములమ్మ, హెచ్‌ఎం పి.నారాయుడు, తదితరులున్నారు.

మా పిల్లలను చదువుకు దూరం చేయొద్దు..



పాఠశాల ముందు నిరసన తెలియజేస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులు

పాలకొండ రూరల్: మండలంలోని బెజ్జి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను విలీనం పేరిట వీరఘట్టం మండలం తలవరం పాఠశాలలో చేర్చే ప్రయత్నం మానుకోవాలని గ్రామస్తులు కోరారు. ఈ మేరకు విద్యార్థులు, తల్లిదండ్రులు పాఠశాల ఎదుట గురువారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. పిల్లలను పక్క గ్రామానికి పంపించే విషయంలో ఎన్నో ఇబ్బందులున్నాయన్నారు. పాఠశాలను గ్రామంలో కొనసాగించాలని పలుమార్లు కోరినా అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పాఠశాలను యథావిధిగా కొనసాగించాలని సర్పంచ్ శ్రీనివాసరావు, తల్లిదండ్రులు కోరారు.

చురుగ్గా పారిశుధ్య పనులు

గరుగుబిల్లి: మండలంలోని పెద్దూరు పంచాయతీలో పారిశుధ్య పనులు చాలా చురుగ్గా చేపడుతున్నారు. సర్పంచ్ ఎం.నారాయణమ్మ, ఉపసర్పంచ్ టి.ఎల్లంనాయుడుల ఆధ్వర్యంలో చేపడుతున్న ఈ పనుల్లో కాలువల్లో పేరుకుపోయిన మురుగు, పూడికలు తొలగించడంతో పాటు వీధుల్లోని చెత్తాచెదారం డంపింగ్‌యార్డుకు తరలించారు. వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకుంటున్నట్లు పంచాయతీ కార్యదర్శి పాపారావు తెలిపారు.

లేబర్ కోడ్‌లు రద్దు చేయాలి



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా కార్యదర్శి దావాల రమణారావు

వీరఘట్టం: లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దావాల రమణారావు డిమాండ్ చేశారు. ఈ మేరకు మండల కేంద్రంలో గురువారం నిర్వహించిన జీపుజాతాలో ఆయన మాట్లాడుతూ.. స్కీమ్ వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించడంతో పాటు కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను కూడా రెగ్యులర్ చేయాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వై.మన్మథరావు, ఉపాధ్యక్షుడు వి.ఇందిర, జిల్లా నాయకులు జి.జ్యోతి, ప్రసాదరావు, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

జియ్యమ్మవలస రూరల్: మండల పరిధిలోని పలు ప్రాంతాలకు శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతున్నట్లు ఆ శాఖ ఈఈ కె.విష్ణుమూర్తి ఓ ప్రకటనలో గురువారం తెలిపారు. విద్యుత్ తీగలను తాకే చెట్లకొమ్మల తొలగింపు పనుల నేపథ్యంలో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఈ అంతరాయం ఉంటుందన్నారు. వినియోగదారులు గమనించి, సహకరించాలని ఆయన కోరారు.

జూలై 5న జాతీయ లోక్ అదాలత్

పాలకొండ రూరల్: వచ్చే నెల 5న స్థానిక న్యాయస్థానంలో జాతీయ లోక్‌అదాలత్ కార్యక్రమం చేపట్టనున్నారు. ఈ మేరకు పాలకొండ జూనియర్ సివిల్ జడ్జి చందక హరిప్రియ గురువారం స్థానిక బార్ అసోసియేషన్‌లో న్యాయవాదులతో గురువారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కేసుల పరిష్కారం కోరిన కక్షిదారులు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. రాజీయే చక్కని పరిష్కార మార్గమని సూచించారు. కార్యక్రమంలో న్యాయవాదులు యు.మురళీమోహన్, చందక జగదీష్‌కుమార్, కనపాక సూర్యప్రకాష్, గోవిందరావు పాల్గొన్నారు.

వితరణ

పాలకొండ రూరల్: స్థానిక ఇందిరానగర్ కాలనీలో గల అంగనవాడీ కేంద్రంలో ఉన్న చిన్నారులకు పట్టణానికి చెందిన పల్లా కొండలరావు స్టీల్ భోజనం ప్లేట్లు, గ్లాసులు అందించారు. గురువారం జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. పిల్లల ఆరోగ్య రక్షణకు సహకారం అందిస్తామని చెప్పారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన

జియ్యమ్మవలస రూరల్: ప్రజాసంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో కె.ధర్మారావు కోరారు. ఇదే విషయమై ఆయన మండలంలోని అలమండ పంచాయతీ, వనిజ గ్రామంలో గ్రామస్తులతో సమావేశమై, పలు కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ కొండగొర్రి జ్యోతి, తహసీల్దారు వై.జయలక్ష్మి, ఏవో విజయభారతి పాల్గొన్నారు.

ఏజెన్సీలో మౌలిక సదుపాయాలు కల్పిస్తాం



కుల ధ్రువీకరణ పత్రాలను అందజేస్తున్న ఇన్‌చార్జ్ ఎంపీడీవో

కొమరాడ: ప్రతీ గిరిశిఖర గ్రామానికి తాగునీరు, విద్యుత్, ప్రాథమిక విద్య తదితర మౌలిక సౌకర్యాలు కల్పిస్తున్నామని ఇన్‌చార్జ్ ఎంపీడీవో ఎస్.రమేష్ తెలిపారు. మండలంలోని పాలెం గ్రామంలో జాతీయ డీఏ జుగా కార్యక్రమం గురువారం నిర్వహించి, మండలంలోని తొమ్మిది ఏజెన్సీ గ్రామాలను జుగాకు ఎంపిక చేశారు. ఎంపిక చేసిన గ్రామాల్లో గిరిజన సమస్యలను పరిష్కరిస్తున్నామని చెప్పారు. పాలెంలోని 106 కుల ధ్రువీకరణ పత్రాలు, రేషన్ కార్డులు 15, ఆయుష్మాన్ భారత్ 10, సామాజిక భద్రత పింఛన్లు 2 పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో వెలుగు ఏపీఎం సురేష్, హౌసింగ్ సిబ్బంది,అంగన్‌వాడీ సిబ్బంది, ఆరోగ్య శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయండి



కొమరాడ: సమ్మెపై ప్రచారం చేస్తున్న సీఐటీయూ నాయకులు

గరుగుబిల్లి/కొమరాడ:

కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ జూలై 9న దేశవ్యాప్త సమ్మె చేపడుతున్నామని, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి బీవీ రమణ, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు డి.రమణారావులు పిలుపునిచ్చారు. సమ్మెపై ప్రచారంలో భాగంగా నిర్వహిస్తున్న జీపుజాతా గరుగుబిల్లి, కొమరాడ మండల కేంద్రాలకు గురువారం చేరుకుంది. గరుగుబిల్లిలో జరిగిన కార్యక్రమంలో సీఐటీయూ నాయకుడు రమణ, కొమరాడలో జరిగిన కార్యక్రమంలో రమణారావులు పాల్గొని, సమ్మె దేనికోసం చేస్తున్నారు.. సమ్మె ఉద్దేశాలను ప్రజలకు వివరించారు. కేంద్రంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం వరుసగా మూడోసారి అధికారంలోకి వచ్చినా దేశానికి ఏం ప్రయోజనం చేకూరలేదన్నారు. అలాగే రైతాంగాన్ని ఆదుకునే ప్రయత్నం చేయలేదని విమర్శించారు. ఎప్పుడూ రైతాంగానికి నష్టం చేకూర్చే చట్టాలే తెచ్చింద తప్ప మేలు చేయలేదని మండిపడ్డారు. రాష్ట్రంలో డబుల్ ఇంజిన్ ప్రభుత్వం ఉన్నా అభివృద్ధి, సంక్షేమం శూన్యమన్నారు. గరుగుబిల్లిలో జరిగిన కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డి.రమణారావు, వై.మన్మథరావు తదితరులు పాల్గొనగా కొమరాడలో జరిగిన కార్యక్రమంలో సీఐటీయూ ప్రధాన కార్యదర్శి వై.మన్మథరావు, జిల్లా ఉపాధ్యక్షురాలు వి.ఇందిర, సీఐటీయూ నాయకుడు కె.సాంబమూర్తి తదితరులు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): కురుపాం మండల కేంద్రంలో జరిగిన జీపుజాతా కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి వై.మన్మథరావు పాల్గొని, కేంద్ర ప్రభుత్వ వైఖరిని విమర్శించారు. కార్మిక హక్కులకు భంగం కలిగించే లేబర్ కోడ్‌లను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. స్కీం వర్కర్లకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, 8 గంటల పనిగంటలను 12 గంటలు చేసే నిర్ణయం వెనక్కి తీసుకోవాలన్నారు. అవుట్ సోర్సింగ్ ఉద్యోగాలను రెగ్యులర్ చేయాలని కోరారు. జూలై 9న జరిగే దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని కోరారు.

మాదకద్రవ్య మహమ్మారిని తరిమికొట్టాలి

వాడవాడలా అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. అధికారులు, విద్యార్థులంతా ఈ కార్యక్రమంలో పాల్గొని, అవగాహన ర్యాలీలు చేపట్టారు. మాదకద్రవ్య మహమ్మారిని తరిమికొడదాం.. డ్రగ్స్ వద్దు..ఆరోగ్యమే ముద్దు..అని నినాదాలు చేశారు. గంజాయి, కొకైన్, హెరాయిన్, మద్యం, సిగరెట్, ఖైనీ వంటి వాటికి దూరంగా ఉండాలని సూచించారు. మత్తు పదార్థాలకు బానిసలైతే ఉజ్వల భవిష్యత్ అంధకారమవుతుందన్నారు. యువత వ్యసనాలు వీడి, లక్ష్యం వైపు సాగాలని భవిష్యత్ తరాలకు స్ఫూర్తిగా నిలవాలని కోరారు.

–పాలకొండ, కురుపాం



గరుగుబిల్లిలో మాదకద్రవ్యాల నియంత్రణపై అవగాహన కల్పిస్తున్న ఎంపీడీవో పైడితల్లి



జియ్యమ్మవలస రూరల్: ర్యాలీలో పాల్గొన్న అధికారులు



గుమ్మలక్ష్మీపురంలో మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, విద్యార్థులు



పాలకొండ: ర్యాలీ చేస్తున్న విద్యార్థులు



సీతంపేట: ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, పోలీసులు, విద్యార్థులు



వీరఘట్టం: విద్యార్థులతో కలిసి ర్యాలీ చేస్తున్న ఎంపీడీఓ వెంకటరమణ, ఎస్సై కళాధర్